బడుగు జీవుల పాలిట శాపం కల్తీ సారా

- యథేచ్ఛగా విక్రయాలు.. పట్టించుకోని అధికారులు
- కూటమి నేతలపై వెల్లువెత్తిన ఆరోపణలు
- కల్తీ సారా తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తి



కన్నాపురంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న సారా ప్యాకెట్లు



కల్తీ సారా తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన పీరబ్బాయి



కన్నాపురంలో ప్యాకెట్ సారా తాగుతున్న మందుబాబు

కొయ్యలగూడెం: ఏరులై పారుతున్న నాటుసారా వలన కన్నాపురం గ్రామం వీధుల్లో మందుబాబుల చిందులతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా మందుబాబులు నాటు సారా ప్యాకెట్లు కొనుగోలు చేసి తాగుతూ ఊగుతున్నారు. పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లడానికి, మార్కెట్‌లోకి వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లులు వాపోతున్నారు. గణేష్ సెంటర్ మొదలుకొని బుట్టాయగూడెం, పోలవరం, పీఆర్‌గూడెం రోడ్లలో సారా విక్రయదారులు పాన్ షాపుల మాదిరిగా ఏర్పాటు చేసి మరీ కల్తీ సారాను విక్రయిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కల్తీ సారా తాగడం వలన పోతుపోయిన పీరబ్బాయి అనే వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతడిని జంగారెడ్డిగూడెం తరలించగా వెంటిలేషన్‌పై ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. సారా విక్రయదారుల వెనుక కూటమి నేతల ప్రోద్బలం వలన సారాను అరికట్టాల్సిన ప్రభుత్వ శాఖలు అచేతనంగా మారాయని ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పైగా కల్తీసారా తాగి ఇటీవల కొంతమంది తీవ్ర అస్వస్థకు గురికాగా వారంతా జంగారెడ్డిగూడెం, ఇతర పట్టణ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. అయితే దీనిపై రగడ చేయకుండా ఉండాలని ఆందోళన చేస్తే గుట్టు రట్టువుతుందని సారా సిండికేట్లు భయపెట్టినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ గ్రామాల్లో పకడ్బందీగా నాటు సారా తయారీపై కొన్ని పార్టీల నాయకులు ఉక్కుపాదం మోపారన్నారు. కానీ మైదాన ప్రాంత గిరిజనులను వసపరుచుకొని కొందరు నాటు సారా తయారు చేస్తున్నారని అందుకు ముఖ్యంగా కావలసిన బెల్లం కన్నాపురం గ్రామంలోనే కొందరు అక్రమ వ్యాపారస్తులు విక్రస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సారా ప్యాకెట్లు ఐదు లీటర్ల నుంచి పది లీటర్ల వరకు పార్సిల్స్‌గా తయారు చేసి పలు జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారని, అందుకు అమాయకులైన వ్యక్తులను వారి సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్కులు లక్షలాది రూపాయల వ్యాపారం చేస్తున్నారన్నారు.

ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు



రోజుల తరబడి నాటు సారా తాగుతూ మగాళ్లు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నా పెనిమిటి పీరబ్బాయి ఊళ్లోకి వచ్చిన కల్తీ సారా తాగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు, పెద్దాసుపత్రిలో రేపో మాపో అంటూ గడుపుతున్నాడు. నా పెనిమిటికి ఏమన్నా అయితే నా కుటుంబం మొత్తం రోడ్డున పడుతుంది.

–పోతు బోయిన బోదమ్మ, కన్నాపురం

కూటమి నేతల అరాచకాలు



గ్రామాల్లో కూటమి నేతల అరాచకాలు పెరిగిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల వ్యవస్థ ఉన్నంతకాలం నాటు సారాను ప్రభుత్వ శాఖలు సమన్వయంతో దాదాపు అరికట్ట గలిగారు. వారిచ్చే సమాచారంతో దాడులు నిర్వహించి నాటు సారా తయారీ కేంద్రాలు రూపుమాపారు. కానీ ఇప్పుడు సమాచారం ఇవ్వడానికి ఎవరూ లేకుండా పోయారు. ఒకవేళ ప్రజలు సమాచారం ఇస్తే వారిపై కూటమి నేతలు దాడులు చేయడం, లేదా అమాయక సామాజిక వర్గాల నేతలతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారు.

– యడ్లపల్లి సురేష్, కన్నాపురం

మౌలిక సదుపాయాలు కల్పించాలి

టి.నరసాపురం: మండలంలోని ఏఎస్ఆర్ నగర్ విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా సమితి సభ్యుడు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. టి.నరసాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదలు ఇళ్ల నిర్మించుకుని ఏళ్లు గడుస్తున్నాయన్నారు. అయినప్పటికీ నేటికీ ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమస్యలపై గతంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించామని, వారు కూడా సమస్యలు పరిష్కరిస్తామన్నారని నేటికీ కార్య రూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏఎస్ఆర్ నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా బాట పండుగ

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరులో కొండరెడ్డి గిరిజనులు సోమవారం రాత్రి ఘనంగా బాట పండుగను నిర్వహించారు. గిరిజనులు పండించిన కందులు, చిక్కుళ్లు, సామలు, తదితర పంటలు చేతికొచ్చిన తరువాత ఈ బాట పండుగను ఘనంగా నిర్వహిస్తారు. ఈ పండుగ సందర్భంగా వన దేవతకు, గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామంలోని పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, చిన్నాపెద్దా తేడా లేకుండా గిరిజన సాంప్రదాయ నృత్యాలైన డోలుకొయ్యి వాయిద్యాలతో సందడి చేశారు.

క్లుప్తంగా

పట్టిసం శివక్షేత్రం భక్తులతో కిటకిట



వీరేశ్వరస్వామిని దర్శించుకుని పట్టిసం రేవులో లాంచీ దిగుతున్న భక్తులు

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం భక్తులతో కళకళలాడింది. సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు పట్టిసం శివక్షేత్రం చేరుకుని శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. లాంచీపై గోదావరి నదిని దాటి ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ క్షేత్రానికి చేరుకున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత వెంకటేశ్వర్లుకు విరాళం బాండ్‌ను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఓ భక్తుడు సోమవారం రూ.1,01,116 లను విరాళంగా అందజేశారు. అనకాపల్లికి చెందిన గోనెల్లా వెంకటేశ్వర్లు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్‌ను అందించారు.

శివలింగాకార లడ్డూ వేలం



వెంకటేశ్వరరావు దంపతులకు లడ్డూను అందజేస్తున్న ఆలయ చైర్మన్

జంగారెడ్డిగూడెం: మండలంలోని తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి తిరునాళ్ల సందర్భంగా స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన శివలింగాకార లడ్డూను ఆదివారం రాత్రి వేలం నిర్వహించారు. ఈ వేలంలో లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. వేలంలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు రూ.1,16,116 లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ లడ్డూను దేవస్థానం చైర్మన్ ఉప్పునూతల పుల్లారావు, దేవస్థానం కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు దంపతులకు అందజేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టి.నరసాపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని టి.నరసాపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం షెడ్యూల్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలతో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మార్చి 1 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లుగా ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఝాన్సీ, పద్మ, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం: ఈ నెల ఎనిమిదో తేదీన ఒంగోలులో నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) విలీన సభ, మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి కోరారు. మండలంలోని బూరుగువాడ, పందిరిమామిడిగూడెం, వేపులపాడు గ్రామాల్లో సోమవారం విలీన, మహిళా దినోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీ ఎత్తున మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మానవత ఆర్థిక సాయం

పోలవరం రూరల్: పక్షవాతంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న ఇద్దరికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. మండలంలోని బోడిగూడెంలో పక్షవాతంతో బాధపడుతున్న కొక్కెర గాంధీ, కలుం పండమ్మలకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని సోమవారం వారి ఇంటి వద్ద అందించారు. ఆకుల నరసింహమూర్తి, చిలకా రాంబాబు, మూలెం వెంకన్నబాబు, సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కారు

చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె.విజయరాజు

లింగపాలెం: అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలిచ్చి పాలన చేపట్టి 9 నెలలు గడిచినా వాటి ఊసెత్తకుండా తుంగలో తొక్కారని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ కంభం విజయరాజు విమర్శించారు. సోమవారం లింగపాలెం వచ్చిన ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పూర్తి స్థాయి హామీల అమలుకు పూనుకో కపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. ప్రస్తుత బడ్జెట్ అంకెల గారడీని తలపిస్తోందని, దీని ద్వారా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొరగా కేటాయించడాన్ని చూస్తే ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తంచేశారు. పాలనను గాలికి వదిలివేసి కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, రాజకీయ కక్షలతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నా రని ఆయన ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు ఒక పని చేసినా సహించేది లేదని అనడం ఆయన నైజాన్ని తెలియజేస్తుందన్నారు. రాజకీయాలు రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని నాడు ప్రమాణం చేసి, నేడు రాజకీయ పాల నే చేస్తానని ప్రకటించారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. బీవీఎస్ రెడ్డి, మందలపు సాయిబాబా, ముసునూరి వెంకటేశ్వరరావు, భీమరెడ్డి సోమ రెడ్డి, మట్టా సురేష్, ఎ.శాంతారావు, బి.ప్రభాకర్‌రెడ్డి, పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



చింతలపూడి: అరెస్టు చేసిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు



కుక్కునూరు: అదుపులోకి తీసుకున్న మహిళతో ఎక్సైజ్ సిబ్బంది

చింతలపూడి: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ఎక్సైజ్ అధికారులు నాగిరెడ్డిగూడెంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో లింగపాలెం మండలం ధర్మాజీగూడేనికి చెందిన కచ్చా రాటాలు రాజు మోటార్ సైకిల్‌పై రెండు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా గుర్తించి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. నాగిరెడ్డిగూడెంలో వడిత్య బోడి వద్ద రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, వారిద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

కుక్కునూరు: మాధవరంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు ఓ మహిళ వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు సోమవారం మాధవరంలో దాడులు నిర్వహించగా ఓ మహిళ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ పట్టుబడినట్టు చెప్పారు.

మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్‌జబీర్ తెలిపారు. సూర్య కళాశాల రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా, సాయిబాలాజీ టౌన్‌షిప్‌కు చెందిన చనమాల రాంబాబు వద్ద 46 మద్యం బాటిళ్లు గుర్తించామన్నారు. రాంబాబు నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



విద్యార్థులను పాఠ్యాంశ వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: ఇంటర్మీడియట్ భవిష్యత్‌కు పునాదిలాంటిదని పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా 334 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 15 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఉండ్రు కుసుమ తెలిపారు. అనంతరం గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. కష్టపడి చదివిన దానిని ఇష్టంతో రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డీఓ భక్త హనుమాన్, తదితరులు పాల్గొన్నారు.

300 ఆవులకు గాలికుంటు టీకాలు



శ్రీవారి గోసంరక్షణశాలలో ఆవుకు టీకాను వేస్తున్న పశువైద్య సిబ్బంది



గాలికుంటు వ్యాధి సోకిన ఆవుకు నోట్లో ఏర్పడిన పుండ్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ శాలలోని ఆవులకు, దూడలకు సోమవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ తెలిపారు. ఈ నెల 31 వరకు నిర్వహించనున్న జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ ఆరో రౌండ్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో పర్యటించి, పాడి పశువులకు ఉచితంగా ఈ టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా శ్రీవారి దేవస్థానం గోసంరక్షణ శాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 300 ఆవులకు, 50 దూడలకు ఈ టీకాలు వేశామన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ ఈ టీకాలు వేయించడం వలన పశువులు తక్కువగా పాలు ఇస్తాయనే అపోహలను పాడి రైతులు వీడాలన్నారు. గాలి కుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్రమైన జరంతో బాధ పడుతూ, నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతాయన్నారు. అలాగే ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉందన్నారు. 4–6 నెలల వయస్సు ఉన్న పెయ్యి దూడలకు బ్రూసెల్లా టీకాలు వేస్తున్నామని, పశువు జీవిత కాలంలో ఒక్కసారి మాత్రమే ఈ టీకా వేయించాల్సి ఉంటుందన్నారు. కావున రైతులు దూడలకు ఈ టీకాలు వేయించాలని సూచించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున మూడో తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టవలసిన ధర్నా కార్యక్రమం, ఆరో తేదీన విజయవాడలో చేపట్టాల్సిన ధర్నా కార్యక్రమం వాయిదా పడినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్న ఆయా మున్సిపల్ కార్యాలయాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేయాలని రాష్ట్ర సమితి పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో బొక్కా శ్రీనివాస్‌రావు, కంతేటి వెంకటరావు, నిమ్మల సుబ్బారావు, దోసూరి నాగరాజు, అయినాల ముత్యాలరావు, అప్పలస్వామి, బాలు, కొత్తూరి నాగేశ్వరావు, ఏమిలేశ్వరరావు, కొత్తూరి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలసి గ్రామస్తుల రాస్తారోకో



మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు ఎంపీయూపీ స్కూల్‌ని హైస్కూల్‌గా మార్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులతో సహా గ్రామస్తులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఎంపీయుపీ స్కూల్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీయూపీ స్కూల్ అభ్యున్నతికి గ్రామస్తులు లక్షలాది రూపాయలు విరాళం అందించి అభివృద్ధి చేశామన్నారు. అయితే ఇటీవల విద్యాశాఖ ఎంపీయూపీ స్థాయి నుంచి ఎంపీపీ స్కూల్‌గా మారుస్తూ ఆదేశాలు జారీ చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. గత నెల 28వ తేదీ ఇదే సమస్యపై నిరసన వ్యక్తం చేసి తమ పిల్లలచే తరగతుల బహిష్కరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. కానీ విద్యాశాఖ నుంచి ఏ విధమైన స్పందన రాకపోగా 6, 7, 8 తరగతులు కన్నాపురం హైస్కూల్‌లో విలీనం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడకు నిరసనగా రాస్తారోకోకు పిలుపునివ్వగా గ్రామస్తులు పార్టీలకతీతంగా ఏకమై మెయిన్ రోడ్డుపై బైఠాయించారు. ఉయ్ వాంట్ హైస్కూల్ అంటూ నినాదాలు చేయడంతో పాటు రాకపోకలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం మార్చుకొని పక్షంలో దిప్పకాయలపాడు పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు గ్రామస్తులతో చర్చించి సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. నాల్గో తేదీ నాటికి విద్యాశాఖ నుంచి స్పష్టమైన హామీ రాని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని, పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో బంద్ పాటిస్తామని సర్పంచ్ సున్నం శాంత కుమారి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



భూలక్ష్మీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న భూలక్ష్మీదేవి ఆలయ 50వ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కలశ స్థాపన, అఖండ దీపారాధన, కుంకుమ పూజలను అర్చకులు త్రినాథశర్మ నిర్వహించారు. కాగా ఈ ఉత్సవాలు ఆరో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముప్పిడి సురేష్ రెడ్డి, కేతిరెడ్డి రాఘవరెడ్డి, కె.హనుమంతరావు, అంబటి పుల్లారెడ్డి, పైడిమర్ల ప్రసాద్‌రెడ్డి, పి.పిచ్చిరెడ్డి, కొప్పుల చౌదరీ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పైడిమర్ల జగన్‌మోహన్‌రెడ్డి, దాసరి సతీష్‌రెడ్డి, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హైస్కూల్‌కు కంప్యూటర్, బీరువాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చింతలపూడి: పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి ఆలోచించి సహాయం చేయడం అభినందనీయమని యర్రగుంటపల్లి పొట్టి మాణిక్యం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బి.బాబూరావు అన్నారు. పాఠశాలలో విద్యనభ్యసించిన 1986–91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఒక కంప్యూటర్, రెండు బీరువాలు అందజేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.బాబురావుకు కంప్యూటర్‌ను, బీరువాలను పూర్వ విద్యార్థులు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విర్డ్‌లో విజయవంతంగా శస్త్ర చికిత్సలు



విర్డ్ ఆసుపత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు కృష్ణ కిరణ్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆసుపత్రిలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అందులో ప్రముఖ తుంటి, మోకాలు మార్పిడి వైద్యులు కృష్ణ కిరణ్ 12 మంది రోగులను పరీక్షించారు. అందులో నలుగురికి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు మాట్లాడుతూ విర్డ్‌లో అందుతున్న అత్యాధునిక వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వెంపరాల నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

5న అన్నసమారాధన

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెంలో కొలువైన ఆంజనేయ స్వామి గుడి వద్ద ఈ నెల 5వ తేదీన అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.